# ప్రజా మార్గము

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 171 పేజిలు : 04 వెల రూ. 2 ఆదివారం 21 - 12 - 2025




మెస్సీ భారత పర్యటన ఖర్చు రూ.100 కోట్లు , భారత ప్రభుత్వానికి రూ.11 కోట్లు పన్ను చెల్లింపు

## హైదరాబాద్, వరంగల్ నగరాల్లో డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఆరుగురు అరెస్టు



2 లో

కొత్త సంవత్సరం వస్తున్న నేపథ్యంలో తనిఖీలు చేపట్టిన పోలీసులు

330 గ్రాముల గంజాయి, 3 గ్రాముల కొకైన్, 11.5 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం

వరంగల్, మియాపూర్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఆరుగురి అరెస్టు

### ఎమ్మెల్యేలపై తెలంగాణ ముఖ్యమంత్రి

# రేవంత్ రెడ్డి ఆగ్రహం!

- పంచాయతీ ఎన్నికల ఎఫెక్ట్
- 16 మంది ఎమ్మెల్యేలపై రేవంత్ రెడ్డి అసహనం!
- రెబల్స్‌తో సమన్వయం చేయలేకపోయారంటూ ఎమ్మెల్యేలపై ముఖ్యమంత్రి ఆగ్రహం
- బంధువులను అభ్యర్థులుగా నిలబెట్టడంపై అసహనం
- ఇప్పటికైనా తీరు మార్చుకుని పార్టీ నిబంధనలకు లోబడి పని చేయాలన్న అధిష్ఠానం
- పంచాయతీ ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం టెలికాన్ఫరెన్స్
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ సమావేశానికి హాజరు



పంచాయతీ ఎన్నికల్లో సరిగ్గా పని చేయలేదంటూ 16 మంది ఎమ్మెల్యేలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం టెలికాన్ఫరెన్స్ నిర్వహించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ తదితరులు సమావేశానికి హాజరయ్యారు. పంచాయతీ ఎన్నికల ఫలితాలపై చర్చించారు. ఈ సందర్భంగా, పలు ప్రాంతాల్లో రెబల్స్‌ను సమన్వయం చేయలేకపోయారంటూ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ - మిగతా 2 లో

## కేసీఆర్ ప్రజల్లోకి వస్తున్నారు



2 లో

- రేవంత్ రెడ్డి హనీమూన్ ముగిసింది
- కేటీఆర్ ఆసక్తికర వ్యాఖ్య
- కేసీఆర్ బహిరంగ సమావేశాలపై రేపు నిర్ణయిస్తామని వెల్లడి
- రేవంత్ రెడ్డిని మాత్రం తాను ఫుట్‌బాల్ ఆడుకుంటానని వ్యాఖ్య
- తాను ఫెయిల్యూర్ లీడర్‌ను కాదన్న కేటీఆర్
- రేవంత్ రెడ్డి పీసీసీ చీఫ్‌గా ఉన్న సమయంలో 7 ఉప ఎన్నికల్లో ఓడిపోయారని వ్యాఖ్య

## సిరియాలో అమెరికా వైమానిక దాడులు



2 లో

ఐసిస్ కేంద్రాలే టార్గెట్

70కి పైగా దాడులతో ఉగ్రవాద శిబిరాల్లో బీభత్సం సృష్టించిన ఎయిర్ ఫోర్స్

అమెరికా ఆపరేషన్ 'హాక్‌ఐ'.. భారీ సంఖ్యలో ఉగ్రవాదులు హతం!

అమెరికన్లపై ఐసిస్ జరిపిన దాడులకు జవాబిచ్చాం.. పెంటగాన్ వ్యాఖ్య

## ఉపాధి హామీ పథకంపై కేంద్రం బుల్డోజర్



- సోనియా గాంధీ తీవ్ర విమర్శలు
- గ్రామీణ పేదల హక్కులను కాలరాస్తున్నారన్న సోనియా
- మహాత్మా గాంధీ పేరును కూడా తొలగించారని ఆరోపణ
- ఈ నల్ల చట్టంపై పోరాటానికి సిద్ధమన్న సోనియా


కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సీపీపీ) చైర్‌పర్సన్ సోనియా గాంధీ, ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంపై కేంద్ర ప్రభుత్వం పద్ధతి ప్రకారం బుల్డోజర్ నడుపుతోందని ఆమె శనివారం ఆరోపించారు. ఇది గ్రామీణ పేదలు, రైతులు, వ్యవసాయ - మిగతా 2 లో

## బెంగాల్ ర్యాలీలో వర్చువల్‌గా మాట్లాడిన మోదీ

- మమతా బెనర్జీ ప్రభుత్వంపై విమర్శలు
- బెంగాల్ ప్రభుత్వం చొరబాటుదారులను కాపాడుతోందని ఆరోపణ
- అందుకే రాష్ట్రంలో ఓటరు జాబితా సవరణను వ్యతిరేకిస్తోందని విమర్శ
- మమత పాలనలో బెంగాల్లో అవినీతి, బంధుప్రీతి రాజ్యమేలుతున్నాయని వ్యాఖ్య
- బీహార్ ఎన్నికల ఫలితం బెంగాల్ ఎన్నికల్లో తమ విజయానికి మార్గం సుగమం చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం



పశ్చిమ బెంగాల్‌లోని నాడియాలో జరిగిన ర్యాలీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రసంగించారు. ఈ సందర్భంగా మమతా బెనర్జీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. పొగమంచు కారణంగా ర్యాలీ ప్రాంతానికి చేరుకోలేకపోయిన ఆయన, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజలనుద్దేశించి మాట్లాడారు. అధికార టీఎంసీ ప్రభుత్వం బెంగాల్‌లో చొరబాటుదారులను ప్రోత్సహిస్తోందని ఆయన ఆరోపించారు. అందుకే రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను వ్యతిరేకిస్తోందని అన్నారు. మమతా బెనర్జీ పాలనలో బెంగాల్లో అవినీతి, బంధుప్రీతి, బుజ్జగింపు రాజకీయాలు రాజ్యమేలుతున్నాయని మోదీ దుయ్యబట్టారు. ఇటువంటి మహా జంగిల్ రాజ్‌కు తగిన బుద్ధి చెప్పాలంటే డబుల్ ఇంజిన్ సర్కార్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు. తృణమూల్ నేతలు, ఆ పార్టీ బీజేపీని ఎంత వ్యతిరేకించినప్పటికీ బెంగాల్ అభివృద్ధిని మాత్రం - మిగతా 2 లో





### స్వర్ణాంధ్ర

# స్వచ్ఛాంధ్ర'

- జనవరి 26 నాటికి ఏ రోడ్డుపైనా చెత్త కనిపించకూడదు
- సీఎం చంద్రబాబు
- అర్బన్ ప్రాంతాల్లో డోర్ టూ డోర్ చెత్త సేకరిస్తామన్న సీఎం చంద్రబాబు
- జనవరి 26 నాటికి ఏ రోడ్డుపైనా చెత్త కనిపించకూడదన్న సీఎం
- అనకాపల్లి జిల్లాలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో చంద్రబాబు
- ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టినా అది తాత్కాలికమే అవుతుంది - అందులో ప్రజలు భాగస్వాములైతేనే అది శాశ్వతమవుతుంది
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాది కాలంలోనే అనేక మార్పులు తీసుకొచ్చినట్లు తెలిపారు
- అందరి ఆరోగ్యం కోసం చేపట్టే కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలి





ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టినా అది తాత్కాలికమే అవుతుందని, అందులో ప్రజలు భాగస్వాములైతేనే అది శాశ్వతమవుతుందని సీఎం చంద్రబాబు అన్నారు. అనకాపల్లి జిల్లా పర్యటనలో ఉన్న ఆయన తాళ్లపాలెంలో నిర్వహించిన 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వచ్ఛ భారత్‌పై నివేదిక ఇవ్వాలని గతంలో ప్రధాని కోరారని, ఆయన కోరిక మేరకు నివేదిక ఇచ్చినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాది కాలంలోనే అనేక మార్పులు తీసుకొచ్చినట్లు తెలిపారు. "అందరి ఆరోగ్యం కోసం చేపట్టే కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలి. యూజ్ రికవరీ, రీయూజ్ విధానంతో - మిగతా 2 లో

## మీ సేవ అభినందనీయం



2 లో

ప్రభుత్వ టీచర్‌పై మంత్రి లోకేశ్ ప్రశంసలు

ప్రభుత్వ టీచర్ మోటూరి మంగారాణిని ప్రశంసించిన మంత్రి లోకేశ్

యూట్యూబ్ ఛానల్ ద్వారా వినూత్నంగా విద్యాబోధన

ప్రమాదానికి గురైన విద్యార్థికి అండగా నిలిచిన సేవా స్ఫూర్తి

మంగారాణి వంటి వారితోనే ఏపీ మోడల్ విద్య సాధ్యమన్న లోకేశ్

# సంపాదకీయం

## బీమా భయాలు




భారత బీమా మార్కెట్ మీద పట్టుసాధించాలని విదేశీకంపెనీలు ఉత్సాహపడటమే కాదు, నానాటికీ ఒత్తిడి పెంచుతున్న నేపథ్యంలో, వాటి పూర్తిస్థాయి ప్రవేశానికి ప్రభుత్వం తలుపులు బార్లా తెరిచింది. అందరికీ బీమాఅందరికీ రక్షణ అని అందరికీ నచ్చే, నమ్మకాన్ని ఇచ్చే ఓ చక్కని పేరు బిల్లుకు పెట్టి, 1938నాటి బీమా చట్టం మొదలు నిన్నమొన్నటి వరకూ ఉన్న పలుచట్టాలను ఇందుకోసం ప్రభుత్వం సవరించింది. నూరుశాతం విదేశీప్రత్యక్ష పెట్టుబడికి ఇలా తలుపులు పూర్తిగా తెరవడం ద్వారా ఈ దేశంలోని ప్రతీ పౌరుడికీ 2047నాటికి కచ్చితంగా బీమా కల్పించాలన్న ప్రభుత్వ లక్ష్యం సులువుగా నెరవేరుతుందట. విదేశీ ప్రత్యక్షపెట్టుబడులకు ద్వారాలు కొద్దికొద్దిగా తెరుస్తున్నప్పుడల్లా ప్రభుత్వం కొన్ని అంశాలను బలంగా ముందుకు తెస్తుంది. జీవితబీమా, ఆరోగ్యబీమాల విస్తృతి మనదేశంలో బహుస్వల్పమని, పాతికేళ్లక్రితం వరకూ ఈ రంగం పూర్తిగా ప్రభుత్వ గుత్తాధిపత్యంలో ఉండిపోవడం వల్ల అది ఎదగాల్సినంత ఎత్తుకు ఎదగలేదన్నది వాదన. బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఐఆర్‌డిఎ) ఏర్పాటుద్వారా ఈ రంగాన్ని ప్రైవేటుకు తెరిచేవరకూ అది బలపడలేదని, ఆ తరువాత కూడా ప్రభుత్వపరంగా ఎన్ని ప్రయత్నాలు జరిగినా ప్రజల్లోకి దూకుడుగా విస్తరించలేకపోయిందని అంటారు. ఈ పేరిట, వాజపేయి హయాంలో చిన్నగా మొదలైన ఎఫ్‌డిఐ ప్రవేశాన్ని ఆ తరువాత మరో నాలుగేళ్ళకు కాంగ్రెస్ హయాంలో మరింత హెచ్చించేందుకు ఓ బలమైన ప్రయత్నం జరిగింది కానీ, యూపీఏకు వెన్నుదన్నుగా ఉన్న వామపక్షాలతో పాటు, బీజేపీ కూడా 49శాతం చేయడానికి ఒప్పుకోక ఆగిపోయింది. మంచి సంఖ్యాబలంతో అధికారంలోకి వచ్చిన నరేంద్రమోదీ ప్రభుత్వం వచ్చీరావడంతోనే ఎఫ్‌డిఐని 49శాతం చేసి, ఆ తరువాత డెబ్బయ్‌నాలుగుశాతానికీ, ఇప్పుడు ఏకంగా నూరుశాతానికీ అనుమతించడంతో పాతికేళ్ళ తర్జనభర్జనలకు పూర్తిగా తెరపడినట్టే. ఇప్పటివరకూ జీడీపీలో రమారమి మూడుశాతం వాటాకు పరిమితమైపోయిన బీమా రంగం ఇకపై అద్భుతమైన వేగంతో ఎదుగుతుందనీ, విదేశాల్లో మాదిరిగా ఆరున్నరశాతానికి తాకుతుందని పాలకుల ఆశ. ఎఫ్‌డిఐలతో బలోపేతమైన ప్రైవేటుసంస్థలు రాబోయే రోజుల్లో పెట్టుబడులతో, సరసమైన ఉత్పత్తులతో బీమాను ద్విగుళం బహుళం చేస్తాయని, పెరిగిన పోటీతో ఉద్యోగ ఉపాధి అవకాశాలూ విస్తరిస్తాయని ప్రభుత్వం అంచనాలు కడుతోంది. సహజంగానే భయాలూ, భిన్న వాదనలూ కూడా ఉంటాయి. స్థానిక కంపెనీల్లో భాగస్వాములుగా ఉన్న విదేశీసంస్థలు తామే పూర్తిగా టేకోవర్ చేసే పరిస్థితుల్లో నియంత్రణ ఎలా అన్న ప్రశ్న ఉండనే ఉంది. బీమా కంపెనీతో బీమాయేతర కంపెనీ విలీనాన్ని అనుమతించడంపైనా ప్రశ్నలు ఉన్నాయి. చైర్మన్, ఎండి, సీఈవోలలో కనీసం ఒక్కరు భారతీయ పౌరుడు కావాలన్న నిబంధన బాగున్నప్పటికీ, కంపెనీ కష్టాల్లోకి జారుకున్నాక వీరు చేసేదీ, ప్రభుత్వం చేయగలిగేదీ ఏమిటని కొందరి ప్రశ్న. విదేశీవాటా పరిమితంగా ఉన్నప్పుడు ప్రభుత్వాలు ఎన్ని హామీలైన ఇవ్వవచ్చు. కానీ, వందశాతం చేరికతో ఇక్కడి జనం సొమ్ము ఇక్కడ ఖర్చుకాకుండా విదేశాలకు తరలిపోతుందనో, దేశీయపొదుపు అన్యుల చేతుల్లో పడి ఆవిరైపోతుందనో భయాలు కలగడం సహజం. ఐఆర్‌డిఎకు మరిన్ని అధికారాలు కట్టబెట్టి, వినియోగదారుడు కేంద్రంగా కొత్తమార్పులు చేశామని ప్రభుత్వం చెబుతోంది కనుక, ఆయా కంపెనీల నిర్వహణ, వాటిపై నియంత్రణ విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని నమ్మాలి. విదేశీ కంపెనీలు ఆర్జించిన లాభాలు సరిహద్దులు దాటిపోకుండా తిరిగి ఇక్కడే పెట్టుబడులవుతాయని ఆశించాలి. నూరుశాతం ఎఫ్‌డిఐతో విదేశీ కంపెనీలు తక్కువ మూలధనంతో ఇకపై ఇక్కడ వ్యాపారాలు మొదలుపెట్టుకోవచ్చు, ప్రైవేటు రంగంలో విదేశీ కంపెనీలదే ఇష్టారాజ్యం కావచ్చు. భారతదేశ బీమారంగంలో అన్నీ విదేశీ కంపెనీలే ఉన్నా ఆశ్చర్యపడనక్కరలేదు. ఇప్పటివరకూ 65శాతం వాటాతో అతిబలంగా ఉన్న ప్రభుత్వరంగ ఎల్ఐసికి ఇది పెద్ద పరీక్ష. అమెరికా మీద ఆగ్రహం కలిగినా, చైనామీద చిరాకు వచ్చినా మన నాయకులకు తక్షణమే గుర్తుకు వచ్చే స్వదేశీ నినాదం ఇలా విదేశీపెట్టుబడులకు తలుపులు తెరుస్తున్నప్పుడు గుర్తుకురాకపోవడం ఆశ్చర్యం. స్వదేశీ ముద్దు, విదేశీ వద్దు అంటున్నవారే ఈ దేశ ప్రజలను తమ జీవితాలను, ప్రాణాలను, భద్రతను విదేశీ సంస్థల చేతుల్లో పెట్టి భద్రంగా ఉండమని భరోసా ఇస్తున్నారు.

## పవనన్న చేసిన భగీరథ ప్రయత్నం ఫలించింది

**మొదటిపేజీ తరువాయి** – మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. ప్రజలకు స్వచ్ఛమైన జలాలు అందించేందుకు పవన్ చేసిన భగీరథ ప్రయత్నం ఫలించిందని కొనియాడారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మరో హామీని నెరవేరుస్తున్న పవన్ కల్యాణ్‌కు ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. మంత్రి లోకేశ్ శుభాకాంక్షలపై పవన్ కల్యాణ్ స్పందిస్తూ ధన్యవాదాలు తెలియజేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని 'జల్ జీవన్ మిషన్' పథకాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటున్నామని చెప్పారు. "ప్రజలందరికీ రోజుకు కనీసం 55 లీటర్ల సురక్షిత త్రాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం తీసుకువచ్చిన జల్ జీవన్ మిషన్ పథకాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటూ, ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యం లోని కూటమి ప్రభుత్వం ద్వారా, గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రిగా ఈ అద్భుతమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. ఉభయ గోదావరి జిల్లాల ప్రజల దాహార్తి తీర్చే ఈ 'అమరజీవి జలధార ప్రాజెక్ట్' పట్ల అభినందనలు తెలియజేసినందుకు మిత్రుడు, సహచర మంత్రివర్యుడు నారా లోకేశ్ కు హృదయపూర్వక ధన్యవాదాలు. ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ గారిని నిరంతరం స్మరించుకునేలా మధ్యాహ్న భోజన పథకానికి నామకరణం చేసినందుకు, ఆవిడ జన్మించిన గోదావరి నేల నుంచి మీకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను" అంటూ పవన్ కల్యాణ్ ఎక్స్ లో స్పందించారు.

## మీ సేవ అభినందనీయం

**మొదటిపేజీ తరువాయి** – రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఓ ప్రభుత్వ ఉపాధ్యాయురాలిపై ప్రశంసల వర్షం కురిపించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని లాలాచెరువు నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయురాలు మోటూరి మంగారాణి సేవానిరతిని కొనియాడుతూ సోషల్ మీడియా వేదికగా ప్రత్యేకంగా ఓ పోస్ట్ పెట్టారు. అంకితభావం, సేవా దృక్పథంతో మంగారాణి విధులు నిర్వర్తిస్తున్నారని లోకేశ్ అభినందించారు. తరగతి గది బోధనకే పరిమితం కాకుండా రైమ్స్, ఆటల ఆధారిత పాఠాలు, స్ఫూర్తి కథలు, 3డి యానిమేషన్ వీడియోలు రూపొందించి 'మీఖఅస్త్రుతీఖఅఆ నావంంశీఅం' అనే యూట్యూబ్ ఛానల్‌లో అప్‌లోడ్ చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ విధంగా లక్షలాది మంది విద్యార్థులకు విద్యను చేరువ చేస్తున్న ఆమెకు హ్యాట్సాఫ్ చెప్పారు. మంగారాణి సేవా స్ఫూర్తిని కూడా లోకేశ్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇటీవల అదే పాఠశాల విద్యార్థి సత్తి చరణ్ తేజ్ ప్రమాదానికి గురికాగా, తోటి ఉపాధ్యాయులతో కలిసి విరాళాలు సేకరించి ఆ బాలుడి వైద్యానికి అండగా నిలిచారని గుర్తుచేశారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత అయిన మంగారాణి.. టెక్స్ట్ బుక్ రైటర్‌గా, టీచర్ ట్రైనర్‌గా కూడా సేవలు అందిస్తున్నారని లోకేశ్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల గొప్పతనాన్ని చాటిచెబుతున్న మంగారాణి వంటి ఉపాధ్యాయుల కృషితోనే 'ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్' కల సాకారం అవుతుందని ఆయన తన పోస్టులో ఆశాభావం వ్యక్తం చేశారు.

## బెంగాల్ ర్యాలీలో వర్చువల్‌గా మాట్లాడిన మోదీ

**మొదటిపేజీ తరువాయి** – తాము ఎప్పుడూ ఆపబోమని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి పనులను మమత ప్రభుత్వం అడ్డుకుంటోందని ఆరోపించారు. మమతా బెనర్జీ పాలనలో ఉద్రిక్తతలు, అల్లర్లు, బెదిరింపులతో విసిగిపోయిన ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని అన్నారు. బీహార్ ఎన్నికల ఫలితం బెంగాల్ ఎన్నికల్లో తమ విజయానికి మార్గం సుగమం చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఎమ్మెల్యేలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం!

**మొదటిపేజీ తరువాయి** – ఇన్‌ఛార్జ్‌లపై రేవంత్ రెడ్డి, మహేశ్ కుమార్ గౌడ్ అసహనం వ్యక్తం చేశారు. రెబల్స్‌తో సమన్వయ లోపం, బంధువులను అభ్యర్థులుగా నిలబెట్టడం ద్వారా పార్టీకి తీరని నష్టం చేశారని సీఎం అన్నారు. ఇప్పటికైనా తీరు మార్చుకుని పార్టీ నియమ నిబంధనలకు లోబడి పని చేయాలని ఆదేశించారు. తెలంగాణలో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 12,733 స్థానాలకు గాను కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు 7,000కు పైగా స్థానాల్లో గెలవగా, బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు 3,502కు పైగా స్థానాల్లో, బీజేపీ 688 స్థానాల్లో విజయం సాధించారు. తమకు పట్టున్న కొన్ని స్థానాలను కోల్పోవడంపై కాంగ్రెస్ అధిష్ఠానం సీరియస్‌గా ఉంది. ఈ క్రమంలో బాధ్యులపై అధిష్ఠానం ఆగ్రహం వ్యక్తం చేసింది.

## జనవరి 26 నాటికి ఏ రోడ్డుపైనా చెత్త కనిపించకూడదు

**మొదటిపేజీ తరువాయి** – ముందుకెళ్లాలి. వాడిన ప్లాస్టిక్ ఇస్తే డబ్బు ఇచ్చేలా చూస్తున్నాం. వ్యర్థాలను వనరుగా, ఆస్తిగా మారుస్తున్నాం. ఉత్తమ పారిశుద్ధ్య కార్మికులకు అవార్డులు ఇస్తున్నాం. వచ్చే ఏడాది జూన్ నాటికి ఏపీని ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా మారుస్తాం. ఇప్పటికే సచివాలయంలో ప్లాస్టిక్ వాడకుండా చర్యలు చేపట్టాం. గత ప్రభుత్వం వదిలిన 86 లక్షల టన్నుల చెత్తను తొలగించాం. రీసైక్లింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నాం. జనవరి 26 నాటికి ఏ రోడ్డుపైనా చెత్త కనిపించకూడదు. ప్రస్తుతం 26 ప్రాంతాల్లో స్వచ్ఛ రథాలు ఉన్నాయి. అవసరమైతే 100 రథాలు ఏర్పాటు చేసి పొడిచెత్త సేకరిస్తాం. మీరు ఇచ్చిన పొడిచెత్తకు డబ్బు కూడా ఇస్తాం. ఇంట్లో చెత్త ఊడ్చి రోడ్డుపై వేయడం మానుకోవాలి. అందరిలో సామాజిక స్పృహ రావాలి. రోడ్లు కూడా మనవే. అర్బన్ ప్రాంతాల్లో డోర్ టూ డోర్ చెత్త సేకరిస్తారు. ఇంట్లో చెత్తను మీరే కంపోస్ట్‌గా తయారు చేసుకోవచ్చు. పట్టణాల్లో 5 లక్షల ఇళ్లలో, గ్రామాల్లో 10 లక్షల ఇళ్లలో కంపోస్ట్ తయారు చేయాలనేది లక్ష్యం. వీలున్న ప్రతి ఒక్కరూ కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేసుకోవాలి. ఇంటిచుట్టూ స్థలం ఖాళీగా ఉన్నా ఎక్కడికో వెళ్లి కూరగాయలు కొంటున్నారు. కూరగాయలు ఇంట్లోనే పండించుకుంటే అందరికీ ఆరోగ్యం, డబ్బు ఆదా అవుతుంది. ఉత్తరాంధ్రలో సేకరించిన చెత్త నుంచి కరెంట్ ఉత్పత్తి చేస్తున్నారు. చెత్త నుంచి కరెంట్ ఉత్పత్తి చేసే




మరో 6 ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నాం. మార్చి నాటికి గోబర్ యూనిట్లు పూర్తి చేస్తాం" అని చంద్రబాబు పిలుపునిచ్చారు. "అక్టోబరు 2 తర్వాత రాష్ట్రంలో ఎక్కడా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కనిపించకూడదు. ఎలక్ట్రానిక్ వ్యర్థాల పునర్వినియోగం దిశగా చర్యలు చేపట్టాం. గ్రామాల్లో కూడా ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి ఉండాల్సిందే. ఏం పని చేశామో మాకు మేమే బేరీజు వేసుకుంటున్నాం. కలెక్టర్లు, ఎస్పీల పనితీరునూ బేరీజు వేస్తున్నాం. రాష్ట్రాన్ని బాగు చేసుకోవాల్సిన బాధ్యత మనదే. మేం వచ్చాక అనకాపల్లి జిల్లాను శరవేగంగా అభివృద్ధి చేస్తున్నాం. జిల్లాకు 46 పరిశ్రమలు వస్తున్నాయి. రాంబిల్లి, పూడి, నక్కపల్లి, మాకవరపాలెంలో పరిశ్రమలు వస్తున్నాయి. కోడూరు, పరవాడ, అచ్యుతాపురంలో పరిశ్రమలు వస్తున్నాయి. అరకు కాఫీకి ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చాం" అని చంద్రబాబు తెలిపారు. "కిలో అరకు కాఫీ రూ.10 వేల ధర పలికింది. ఆన్‌లైన్‌లో పెట్టిన అరకు కాఫీని రెండు గంటల్లోనే కొనేశారు. ఇప్పుడు ప్రజలంతా పంచదార మానేసి, బెల్లం వాడుతున్నారు. ప్రతిచోటా బెల్లం, దాని ఉత్పత్తుల వినియోగం బాగా పెరిగింది. అనకాపల్లి జిల్లా రైతులు ఆర్గానిక్ బెల్లం తయారు చేయాలి. ఆర్గానిక్ బెల్లాన్ని ఇతర దేశాలకు ఎగుమతి చేయవచ్చు. ఇప్పుడు ప్రపంచమంతా విశాఖ వైపు చూస్తోంది. విశాఖకు డేటా సెంటర్లు, నాలెడ్జ్ సెంటర్లు వస్తున్నాయి. అలాగే స్టీల్ సిటీ, అల్యూమినియం సిటీ వస్తున్నాయి. ఇవన్నీ వస్తే ఉమ్మడి విశాఖ జిల్లా రూపురేఖలు మారతాయి. మన అభివృద్ధి యజ్ఞాన్ని భగ్నం చేసేందుకు రాక్షసులు వస్తున్నారు. టీచర్లు, కానిస్టేబుల్ ఉద్యోగాలపైనా కోర్టులకు వెళ్తున్నారు. ఎందరు అడ్డుకున్నా రాష్ట్ర ప్రగతి ఆగదు. విశాఖలో యోగా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నాం. యోగా డే కార్యక్రమాన్ని ప్రధాని మోదీ కూడా మెచ్చుకున్నారు. విశాఖను ఏఐ, డేటా, యోగా సెంటర్‌గా మారుస్తున్నాం. గత ప్రభుత్వం సర్వే రాళ్లపై రూ.700 కోట్లు ఖర్చు చేసింది. గంజాయి పంటలను కాఫీ తోటలుగా మార్చిన ఘనత మా ప్రభుత్వానిదని" చంద్రబాబు వెల్లడించారు.

## సిరియాలో అమెరికా వైమానిక దాడులు

**మొదటిపేజీ తరువాయి** – సిరియాలోని ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాద స్థావరాలే లక్ష్యంగా అమెరికా సైన్యం భారీ ఎత్తున ప్రతీకార దాడులు నిర్వహించింది. శనివారం తెల్లవారుజామున అమెరికా సెంట్రల్ కమాండ్ నేతృత్వంలో జరిగిన ఈ వైమానిక దాడులు ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేశాయి. సిరియాలోని ఎడారి ప్రాంతాల్లో ఉన్న ఐసిస్ శిక్షణ కేంద్రాలు, ఆయుధ గిడ్డంగులు మరియు కమ్యూనికేషన్ కేంద్రాలపై అమెరికా యుద్ధ విమానాలు విరుచుకుపడ్డాయి. 'ఆపరేషన్ హాక్‌ఐ' పేరుతో ఎయిర్ ఫోర్స్ చేపట్టిన ఈ దాడుల్లో పెద్ద సంఖ్యలో ఉగ్రవాదులు మరణించినట్లు సమాచారం. ఇటీవల అమెరికా సైనికులు, మిత్రదేశాల దళాలపై ఐసిస్ జరిపిన దాడులకు సమాధానంగానే ఈ భారీ ఆపరేషన్ చేపట్టినట్లు అమెరికా రక్షణ శాఖ(పెంటగాన్) స్పష్టం చేసింది. ఐసిస్ ఉగ్రవాదులు మళ్లీ పుంజుకోకుండా మరియు భవిష్యత్తులో దాడులు చేయకుండా వారి సామర్థ్యాన్ని దెబ్బతీయడమే ఈ దాడుల ప్రధాన ఉద్దేశమని సెంట్రల్ కమాండ్ పేర్కొంది. గత కొన్ని రోజులుగా మధ్యప్రాచ్య దేశాల్లో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో, అమెరికా నేరుగా సిరియాలో రంగంలోకి దిగడం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. సిరియాలో ప్రస్తుతం వెయ్యి మందికి పైగా అమెరికన్ సైనికులు ఉన్నారని సమాచారం. ఈ క్రమంలోనే సిరియాలో ఐసిస్ ముప్పును పూర్తిగా తొలగించే వరకు తమ పోరాటం ఆగదని అమెరికా సైనిక వర్గాలు స్పష్టం చేశాయి.



## ఉపాధి హామీ పథకంపై కేంద్రం బుల్డోజర్

**మొదటిపేజీ తరువాయి** – కూలీల హక్కులను కాలరాయడమేనని, వారి జీవనోపాధిపై జరుగుతున్న దాడి అని అభివర్ణించారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ 'ఎక్స్' ఖాతాలో ఒక వీడియో సందేశాన్ని పంచుకున్నారు. రెండు రోజుల క్రితం పార్లమెంటులో వీబీ-జీ రామ్ జీ బిల్లు 2025ను ఆమోదించిన నేపథ్యంలో సోనియా వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. దాదాపు రెండు దశాబ్దాల క్రితం మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ హయాంలో ఈ చట్టాన్ని తీసుకొచ్చిన విషయాన్ని సోనియా గుర్తుచేశారు. ఇది కోట్లాది గ్రామీణ కుటుంబాలకు, ముఖ్యంగా అణగారిన వర్గాలకు జీవనోపాధి భద్రత కల్పించిన ఒక విప్లవాత్మక అడుగు అని ఆమె పేర్కొన్నారు. కరోనా మహమ్మారి సమయంలో ఈ పథకం పేదలకు జీవనాధారంగా



నిలిచిందని తెలిపారు. అయితే, గత 11 ఏళ్లుగా మోదీ ప్రభుత్వం ఈ పథకాన్ని నీరుగార్చేందుకు అనేక ప్రయత్నాలు చేసిందని సోనియా ఆరోపించారు. ప్రతిపక్షాలతో సంప్రదింపులు జరపకుండా, ఏకపక్షంగా ఉపాధి హామీ పథకం స్వరూపాన్నే మార్చేశారని, చివరకు మహాత్మా గాంధీ పేరును కూడా తొలగించారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరికి, ఎక్కడ, ఎంత పని ఇవ్వాలనే నిర్ణయాలను క్షేత్రస్థాయి వాస్తవాలకు దూరంగా ఢిల్లీ నుంచి తీసుకుంటున్నారని విమర్శించారు. "20 ఏళ్ల క్రితం ఈ చట్టం కోసం నేను పోరాడాను. ఇప్పుడు ఈ నల్ల చట్టానికి వ్యతిరేకంగా పోరాడేందుకు కూడా నేను కట్టుబడి ఉన్నాను" అని సోనియా ఉద్ఘాటించారు. ఈ పోరాటంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.

## కేసీఆర్ ప్రజల్లోకి వస్తున్నారు

**మొదటిపేజీ తరువాయి** – రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి హనీమూన్ ముగిసిందని ఇక కేసీఆర్ ప్రజల్లోకి వస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ, కేసీఆర్ రేపు అన్ని విషయాలపై పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేస్తారని తెలిపారు. కేసీఆర్ బహిరంగ సమావేశాలపై రేపటి సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎవరితో ఫుట్‌బాల్ ఆడుకుంటారో తనకు తెలియదని, కానీ తాను మాత్రం ఆయనతో ఫుట్‌బాల్ ఆడుకుంటానని కేటీఆర్ వ్యాఖ్యానించారు. తనను ఫెయిల్యూర్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించడంపై కూడా కేటీఆర్ స్పందించారు. తాను ఫెయిల్యూర్ నాయకుడిని కాదని ఆయన అన్నారు. తాను వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యాక 32 జిల్లా పరిషత్‌లు, 136 మున్సిపాలిటీలను గెలిచామని గుర్తు చేశారు. అయితే రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు 7 ఉప ఎన్నికలు నిర్వహిస్తే అన్ని స్థానాల్లో ఓడిపోయారని కేటీఆర్ గుర్తు చేశారు. ఆయన ముఖ్యమంత్రి అయ్యాక సొంత పార్లమెంటు స్థానాన్ని కూడా గెలిపించలేకపోయారని విమర్శించారు. తాను ఐరన్ లెగ్ కాదని, రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీలే ఐరన్ లెగ్‌లు అని ఆయన అన్నారు. ఢిల్లీలో రేవంత్ రెడ్డి విందులు, వినోదాలు ఎవరి ఇళ్లల్లో జరుగుతున్నాయో అందరికీ తెలుసని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఢిల్లీలోని తుగ్లక్ రోడ్డులో రేవంత్ రెడ్డి ఇల్లును రీమోడల్ చేయించిందే బీజేపీ ఎంపీ అని ఆయన ఆరోపించారు. సీఎం రమేశ్‌కు కాంట్రాక్టులు ఇస్తుంది రేవంత్ రెడ్డేనని అన్నారు. తాను ముఖ్యమంత్రి ఇంట్లోని మహిళలు, పిల్లలు, మనవడి గురించి మాట్లాడనని కేటీఆర్ స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి వలె తాను కుటుంబ సభ్యుల గురించి మాట్లాడి చిల్లర రాజకీయాలు



చేయదలుచుకోలేదని ఆయన అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉంటుందని కేటీఆర్ వెల్లడించారు.

## హైదరాబాద్, వరంగల్ నగరాల్లో డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఆరుగురు అరెస్టు

**మొదటిపేజీ తరువాయి** – హైదరాబాద్ నగరంలో భారీగా డ్రగ్స్ పట్టుబడ్డాయి. డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఆరుగురిని ఈగల్ టీమ్ పోలీసులు అరెస్టు చేశారు. నగరంలో ప్రతి సంవత్సరం కొత్త సంవత్సర వేడుకల సమయంలో పెద్ద ఎత్తున డ్రగ్స్ పట్టుబడుతుండటం ఆనవాయతీగా వస్తోంది. మత్తు పదార్థాల వ్యాపారంలో 80 నుంచి 90 శాతం డిసెంబర్ – జనవరి మధ్య జరుగుతుందని అంచనా. ఈ నేపథ్యంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. రాష్ట్రంలో డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఆరుగురు డ్రగ్ పెడ్లర్లను అరెస్టు చేసిన పోలీసులు, వారి నుంచి 330 గ్రాముల గంజాయి, 3 గ్రాముల కొకైన్, 11.5 గ్రాముల ఎండీఎంఏను స్వాధీనం చేసుకున్నారు. వరంగల్ జిల్లాలో ముగ్గురు గంజాయి సరఫరాదారులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 80 గ్రాములు, మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 250 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య గంజాయిని సరఫరా



చేస్తున్నట్లు గుర్తించారు.

## ఒక గొప్ప నాయకుడిని ఒక కులానికి పరిమితం చేస్తారా?

**పవన్ కల్యాణ్**

**గొప్ప నాయకులకు కులాలను ఆపాదించవద్దన్న పవన్ కల్యాణ్**

**పొట్టి శ్రీరాములును ఒక కులానికి పరిమితం చేయడంపై ఆవేదన**

**ఉభయగోదావరి జిల్లాల్లో అమరజీవి జలధార ప్రాజెక్టుకు శంకుస్థాపన**

**రూ.3,050 కోట్ల వ్యయంతో సురక్షిత తాగునీటి పథకం**

**బూర్గుల, పొట్టి శ్రీరాములు త్యాగాలను స్మరించుకున్న ఉపముఖ్యమంత్రి**

మహనీయులకు, గొప్ప నాయకులకు కులాలను అంటగడితే మనం ఎప్పటికీ భారతీయులుగా ఎదగలేమని, కేవలం కులాల సమూహంగానే మిగిలిపోతామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ఉభయ గోదావరి జిల్లాల ప్రజలకు సురక్షిత తాగునీరు అందించేందుకు రూ.3,050 కోట్ల వ్యయంతో చేపడుతున్న 'అమరజీవి జలధార' ప్రాజెక్టు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. అంబేద్కర్, గాంధీ, పొట్టి శ్రీరాములు వంటి వారు అందరి కోసం ఆలోచించిన



గొప్పవారని, వారిని కులాలకు అతీతంగా చూడాలని సూచించారు. గతంలో తాను పొట్టి శ్రీరాములు జయంతి నాడు నివాళులు అర్పించేందుకు వెళ్తే, ఆయన విగ్రహం ఒక ఆర్యవైశ్య సత్రం వద్ద ఉందని చెప్పారని, ఆ రోజు తాను ఎంతో ఆవేదనకు గురయ్యానని గుర్తుచేసుకున్నారు. తెలుగు ప్రజలందరి కోసం ప్రాణత్యాగం చేసిన వ్యక్తిని ఒక కులానికి, నెల్లూరు జిల్లాకు పరిమితం చేయడం సరికాదని అభిప్రాయపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా 5 జిల్లాల్లో 'అమరజీవి జలధార' వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుల కోసం ప్రభుత్వం రూ.7,910 కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు 'అమరజీవి' అని పేరు పెట్టడానికి బలమైన కారణం ఉందని వివరించారు. తెలుగువారంతా ఏకం కావాలని ముఖ్యమంత్రి పదవిని త్యాగం చేసిన బూర్గుల రామకృష్ణారావు, తెలుగువారి ఆత్మగౌరవం కోసం ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు తనకు ఎంతో ఇష్టమైన నాయకులని, వారి త్యాగాలను స్మరించుకుంటూనే ఈ పథకానికి ఆ పేరు పెట్టినట్లు స్పష్టం చేశారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి

**కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి**

**ప్రభుత్వ పాఠశాలలకు రూ.2 లక్షల సామాగ్రి**

**అందజేసిన ఐడిబిఐ బ్యాంకు**



**సికింద్రాబాద్, డిసెంబర్ 20 ( ప్రజామంటలు) :** తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదివానని, ప్రతి విద్యార్థి కూడా ఉన్నత లక్ష్యంతో, పట్టుదలతో చదువుకోవాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. బాల్యం నుండే క్రమశిక్షణ, సమయపాలన అలవాటు చేసుకోవాలన్నారు.రాంగోపాల్ పేట డివిజన్ లోని గుండా ఈశ్వరయ్య స్మారక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం ఐడిబిఐ బ్యాంక్, ఎస్.ఆర్.నగర్ శాఖ, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ లో భాగంగా రెండు లక్షల రూపాయల విలువైన 7 బీరువాలు, 50 కుర్చీలు, కార్పెట్, సౌండ్ సిస్టమ్ తదితర సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్రెడ్డి మాట్లాడుతూ.. సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని ఏడు సెగ్మెంట్లలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థుల పరీక్ష ఫీజులను సొంత జీతం డబ్బులతో చెల్లిస్తున్నానని ఆయన తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలకు టాయిలెట్ క్లీనింగ్ మెషిన్లను కూడా తాను సమకూర్చడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. సర్కారు బడిలో చదువుతున్న పిల్లలకు అవసరమయ్యే సామాగ్రిని అందించినందుకు ఐడిబిఐ బ్యాంక్ ఎస్ ఆర్ నగర్ శాఖ అధికారులను ఆయన అభినందించారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రుల తరపున పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. స్వప్నమాల దాతలకు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామ్ గోపాల్ పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్, ఐడిబిఐ బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్, జోనల్ హెడ్ జానకిరామన్, జనరల్ మేనేజర్ కరీం లాల్, రీజినల్ హెడ్ సందీప్ పట్నాయక్, డీజిఎం కోటేశ్వర రావు, ఎస్ ఆర్ నగర్ శాఖ మేనేజర్ అరుణ్ కుమార్,బీజేపీ సీనియర్ నాయకులు టి. రాజశేఖర్ రెడ్డి, కె.ఎమ్. కృష్ణ, ఎస్.రాజు, మీడియా ఇంచార్జి వై. శ్రీనివాస్ ముదిరాజ్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎ. బాలకృష్ణ, డివిజన్ అధ్యక్షుల సందీప్ వర్మ, మహేష్, సోషల్ వర్కర్ ఎ. పద్మ, తదితరులు పాల్గొన్నారు.

# ఎంజీఎన్రేగా రద్దు చేసి పేదల పొట్ట కొట్టడమే బీజేపీ అంతిమ లక్ష్యం

**పీసీసీ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్**

**ఎంజీ రోడ్డులో నిరసన**

**పాల్గొన్న మంత్రులు శ్రీధర్ బాబు,అజారుద్దీన్**

**సికింద్రాబాద్, డిసెంబర్ 20 ( ప్రజామంటలు) :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్రేగా)ను రద్దు చేసి, పేద ప్రజల నోటికాడ ముద్దను లాగేయడమే బీజేపీ ప్రభుత్వ అంతిమ లక్ష్యమని పీసీసీ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్,మంత్రులు డి.శ్రీధర్ బాబు,అజారుద్దీన్, వివేక్ వెంకటస్వామి జూపల్లి కృష్ణారావు వాకిటి శ్రీహరి మాజీ ఎంపీ విహెచ్ లు ఆరోపించారు. ఈ పథకంలో గాంధీజీ పేరును తొలగిస్తూ 'వీబీ%-%జీ%-%రామ్%-%జీ పేరుతో కొత్త బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టి ఆమోదింపజేయడాన్ని నిరసిస్తూ టీపీసీసీ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ ఎంజీ రోడ్‌లోని గాంధీజీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు.ఈ ధర్నాలో ఎమ్మెల్యేలు శ్రీగణేశ్,నవీన్ యాదవ్, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ, ఇది కేవలం పేరు మార్పు కోసం తీసుకొచ్చిన బిల్లు కాదని, రాష్ట్రాలు, స్థానిక సంస్థల హక్కులను హరించడమే కేంద్ర ప్రభుత్వ ఉద్దేశమని విమర్శించారు. గతంలో కేంద్రం 90 శాతం, రాష్ట్రాలు 10 శాతం నిధులు భరిస్తే, కొత్త చట్టం ప్రకారం రాష్ట్రాలపై 40 శాతం భారం మోపుతున్నారని తెలిపారు. దేవుళ్ల పేరుతో పథకాలు తీసుకొస్తూ, చేసేవి మాత్రం దెయ్యాల పనులని బీజేపీపై మండిపడ్డారు. పథకాల నుంచి గాంధీ, నెహ్రూ పేర్లు మార్చగలరేమో కానీ, ప్రజల హృదయాల నుంచి వారిని వేరు చేయలేరని వ్యాఖ్యానించారు. తక్షణమే ఈ బిల్లును వెనక్కి తీసుకుని, మహాత్మా గాంధీ పేరుతోనే పాత పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సనత్ నగర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఐత చిరంజీవి, నస్రీన్,సాయి సందీప్,దీపిక,శిల్ప,వేదప్రకాశ్,మధురవీరన్,మల్లికార్జున్, నోమన్,నాగరాజు,మహేశ్, రఘుయాదవ్, సయ్యద్ ఆయూబ్ తదితరులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.




# ప్రత్యేక అవసరాల చిన్నారుల సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం: కవిత




**హైదరాబాద్, డిసెంబర్ 20 (ప్రజా మంటలు) :** బోయిన్‌పల్లి మనోవికాస్ నగర్‌లోని ఎన్ఐఈపీఐడీలో శిక్షణ పొందుతున్న ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు, వారి తల్లితండ్రులతో తెలంగాణ జాగృతి కార్యాలయంలో సమావేశమైన జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లితండ్రులకు పెన్షన్‌తో పాటు ప్రభుత్వ పథకాలలో ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ, ఇందుకోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని ఆమె హామీ ఇచ్చారు. నెల రోజుల్లో ప్రభుత్వం స్పందించకపోతే తాను నిరాహార దీక్ష చేపడతానని హెచ్చరించారు.మానసిక ఎదుగుదల తక్కువగా ఉన్న వారిని దివ్యాంగులుగా గుర్తింపజేయడానికి గతంలో పార్లమెంట్‌లో పోరాటం చేశామని, కానీ తెలంగాణలో జారీ చేసిన జీవో సరిగా అమలు కాలేదని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్ష మంది వరకు ఈ సమస్యతో ఉన్నవారు ఉన్నారని, వారికి పెన్షన్లు ఇవ్వగలిగే స్థితిలో ప్రభుత్వం ఉందని పేర్కొన్నారు. ఇళ్ల అద్దెల సమస్యను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక అవసరాలు గల పిల్లల కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని, ప్రతి ప్రభుత్వ పథకంలో మెంటల్లీ, ఫిజికల్లీ ఛాలెంజ్డ్ పిల్లల తల్లితండ్రులకు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు.దివ్యాంగులు, మెంటల్లీ ఛాలెంజ్డ్ పిల్లల సమస్యలపై నిరంతరం పోరాటం చేసేందుకు జాగృతి లో ప్రత్యేక డిసబులిటీ విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముందుగా ప్రభుత్వానికి నెల రోజుల గడువు ఇస్తామని, ఆ తర్వాత పెన్షన్లు, ఇళ్లు మంజూరు అయ్యే వరకు ఉద్యమం కొనసాగిస్తామని కవిత స్పష్టం చేశారు.

# నూతన సర్పంచ్, వార్డు సభ్యులకు అభినందనలు

**మాజీ ఎమ్మెల్యే ఓడిదల సతీష్ కుమార్**

**బీఆర్ఎస్‌లో చేరిన సాయినగర్ నాయకులు**

**భీమదేవరపల్లి డిసెంబర్ 20 (ప్రజామంటలు) :** మండలంలోని సాయినగర్ గ్రామ పంచాయతీలో నూతనంగా ఎన్నికైన ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు హుస్నాబాద్ మాజీ శాసన సభ్యులు వొడితల సతీష్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు మండల సురేందర్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీలో చేరారు. సాయినగర్ గ్రామ పంచాయతీ నూతన ఉపసర్పంచ్ నాయిని రవీందర్, వార్డు సభ్యులు కూన స్వప్న, బోడ సంపత్ లు మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ సమక్షంలో అధికారికంగా బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అలాగే కూన రాజు (పాల), కూన సమ్మయ్య, కూన రాజయ్య, పోలు సుభాస్, ఆళ్ల సాంబరాజు, కూన చంద్రయ్య, కూన రాజు, సల్పాల శ్రీనివాస్, మసాని కిరణ్, శిరీష తదితరులు బీఆర్ఎస్ కండువా కప్పుకొని పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి గ్రామ సర్పంచ్ శిఖ ప్రదీప్, సీనియర్ నాయకులు రాగం రమేష్, కొత్తపల్లి గ్రామ అధ్యక్షులు పోలు మహేందర్, సాయినగర్ గ్రామ అధ్యక్షులు దుర్గాని రవీందర్, రేణుకుంట్ల శ్రీనాథ్, సర్జన శంకర్, పూసల సంపత్, పతిపాక మధుకర్, సామల సతీష్ పాల్గొన్నారు. మహిళా విభాగం తరపున కొత్తపల్లి గ్రామ మహిళా అధ్యక్షురాలు కాసగోని మానస, సాయినగర్ గ్రామ మహిళా అధ్యక్షురాలు సట్ల చిన్న మంజుల, పెద్ద మంజుల, ప్రతిపాక స్రవంతి, మాసని శిరీష, దుర్గాని లావణ్య తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధి కోసం అందరూ ఐక్యంగా పనిచేయాలని, బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కొత్తగా చేరిన నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.





## ఘనంగా చెప్యాల ప్రభాకర్ ప్రథమ వర్ధంతి



**భీమదేవరపల్లి, డిసెంబర్ 20 (ప్రజామంటలు) :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ధర్మారం గ్రామంలో ఉద్యమ నాయకుడు, పోరాటయోధుడు చెప్యాల ప్రభాకర్ ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సభలో ప్రభాకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు, గ్రామ పెద్దలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పలువురు నాయకులు మాట్లాడుతూ, చెప్యాల ప్రభాకర్ మంచితనానికి మారుపేరని, ఆయన జీవితమంతా ఉద్యమాలకే అంకితం చేశారని గుర్తు చేశారు. అన్యాయాలపై రాజీ పడకుండా అలుపెరుగని పోరాటం చేసిన ఉద్యమ యోధుడిగా ప్రభాకర్‌ను వారు కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతూ, సామాన్య ప్రజల హక్కుల కోసం తన జీవితాన్ని అర్పించిన వ్యక్తి చెప్యాల ప్రభాకర్ అని వక్తలు పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని పేదల సమస్యలపై ఆయన చూపిన చిత్తశుద్ధి, ధైర్యసాహసాలు నేటి యువతకు ఆదర్శంగా నిలిచాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ జేఏసీ నాయకులు కవ్వ లక్ష్మారెడ్డి, మండల జేఏసీ చైర్మన్ దేగల సారయ్య, తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ సంఘం ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్, హుస్నాబాద్ ఇన్‌చార్జి ఎంఆర్పీఎస్ నాయకులు మాట్ల వెంకటస్వామి, హనుమకొండ జిల్లా టీఎస్ ఎంఆర్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు అంబాల చక్రపాణి, కందే సుధాకర్, బీసీ నాయకులు జగదీష్, ముత్తారం ఉపసర్పంచ్ మాట్ల కుమార్, జగన్మోహన్, కొమ్ముల రవీందర్, కొమ్ములు నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్తకొండ వీరభద్ర స్వామి జాతరపై సమీక్ష




**భీమదేవరపల్లి డిసెంబర్ 20 (ప్రజామంటలు) :** దేవాదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానం 2026 జాతర ఏర్పాట్లపై హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధ్యక్షత వహించగా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా భద్రత, తాగునీరు, పారిశుధ్యం, ట్రాఫిక్, వైద్య సదుపాయాలు తదితర ఏర్పాట్లు సమర్థవంతంగా చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జాతర ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి పి. కిషన్ రావు తెలిపారు.

## జెఎస్ఆర్ ను కలసిన రసూల్‌పల్లి సర్పంచ్ మహేష్



**భీమదేవరపల్లి, డిసెంబర్ 20 (ప్రజామంటలు) :** హుస్నాబాద్ నియోజకవర్గం భీమదేవరపల్లి మండలం రసూల్‌పల్లి గ్రామానికి చెందిన బీజేపీ సర్పంచ్ బోయిని మహేష్ గారు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జన్నపురెడ్డి సురేందర్ రెడ్డిని కన్నారం గ్రామంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా సర్పంచ్‌గా ఎన్నికైన బోయిని మహేష్ ను జెఎస్ఆర్ శాలువతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామాభివృద్ధికి ప్రజాప్రతినిధులు ఐక్యంగా పనిచేయాలని, ప్రభుత్వ పథకాలను ప్రజల వరకు తీసుకెళ్లే దిశగా ముందుకెళ్లాలని సూచించారు.ఈ భేటీలో రసూల్‌పల్లి గ్రామ ఉపసర్పంచ్ కందుల అనిల్ కుమార్, మూడవ వార్డు సభ్యుడు కన్నె బోయిన అరవింద్, ఎనగంటి అనిల్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం స్థానికంగా రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తించింది.

## ఆయిల్ ఫామ్ సాగు విస్తీర్ణం సాగుపై సమీక్ష పాల్గొన్న జిల్లా కలెక్టర్




**జగిత్యాల డిసెంబర్ 20 (ప్రజా మంటలు) :** జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆధ్వర్యంలో ఉద్యాన, వ్యవసాయ, సహకార శాఖ, లోహియ ఆయిల్ పామ్ కంపెనీ, మైక్రో ఇరిగేషన్ సిబ్బందికి ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణము పెరుగుదల కొరకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి మాసం వరకు వారికి నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని ఆదేశాలు జారీచేయడం జరిగినది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఫ్యాక్టరీ ఏర్పాటు పై రైతులకు ఎలాంటి అపోహ వద్దని, గెలల కోత ప్రారంభమైనప్పటి నుండి ప్రతి మండల కేంద్రములో గెలల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసి ఉద్యాన శాఖ, లోహియా కంపనీ సమన్వయముతో రైతుల వద్ద నుండి ప్రభుత్వం నిర్ధారించిన రేటుకి గెలలు కొనుగోలు చేస్తామని మరియు 10 రోజులలో రైతుల బ్యాంకు ఖాతాలలో డబ్బులు జమ చేయబడునని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమములో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజాగౌడ్, జిల్లా ఉద్యాన అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్, ఏ డి ఏ లు, మండల వ్యవసాయ అధికారులు, ఉద్యాన అధికారులు, వ్యవసాయ, ఉద్యాన విస్తీర్ణ అధికారులు, ప్రాథమిక సహకార సంఘాల సీఈఓ లు, లోహియా కంపనీ జనరల్ మేనేజర్, క్షేత్ర సిబ్బంది మరియు డ్రిప్ సిబ్బంది పాల్గొన్నారు.

## కృష్ణవేణి టాలెంట్ స్కూల్ లో క్రిస్మస్ సెలబ్రేషన్స్



**సికింద్రాబాద్, డిసెంబర్ 20 ( ప్రజామంటలు) :** భోలక్ పూర్ లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ లో శనివారం సెమీ క్రిస్మస్ సెలబ్రేషన్స్ ను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నర్సరీ,ఎల్కేజీ,యూకేజీ, ప్రైమరీ విద్యార్థులంతా సాంతాక్లాజ్ దుస్తులు ధరించి, క్రిస్మస్ ట్రీ ని దీపాలతో అలంకరించారు. క్రీస్తు జననం నాటికను ప్రదర్శించి, కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ మంచాల శ్రీనివాసులు మాట్లాడుతూ...క్రీస్తు నేర్పిన బాటలో శాంతి, ప్రేమతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ డా.మంచాల వరలక్ష్మి, టీచర్ల బృందం,విద్యార్థులు, పేరెంట్స్ పాల్గొన్నారు.

## నూతన ప్రజా ప్రతినిధులను అభినందించిన మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ రెడ్డి



**భీమదేవరపల్లి డిసెంబర్ 20 (ప్రజామంటలు) :** మండలంలో పలు గ్రామాల్లో నూతనంగా ఎన్నికైన సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు హుస్నాబాద్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా ముల్కనూర్ లో కలిశారు. ఈ సందర్భంగా వారిని మాజీ ఎమ్మెల్యే అలిగి రెడ్డి ప్రవీణ్ రెడ్డి శాలువాతో ఘనంగా సత్కరించారు. నూతనంగా ఎన్నికైన ముల్కనూర్ గ్రామ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి, ఉపసర్పంచ్ కాసగోని మమత బాలకృష్ణతో పాటు వార్డు సభ్యులను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధికి సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు సమన్వయంతో పని చేసి ప్రజల ఆశయాలను నెరవేర్చాలని ఆకాంక్షించారు. గ్రామ సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల అభివృద్ధి దిశగా కృషి చేస్తే గ్రామాలు ఆదర్శ గ్రామంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ముల్కనూర్ , భీమదేవరపల్లి గ్రామ సర్పంచ్ మాచర్ల కుమారస్వామి, ఉపసర్పంచ్ శనిగరపు ఐలయ్య, వార్డ్ మెంబెర్స్ ని శాలువాతో సత్కరించి అభినందించారు.

## శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయం ఉండి లెక్కింపు



**గొల్లపల్లి డిసెంబర్ 20 ప్రజా మంటలు ( ప్రతినిధి అంకం భూమయ్య) :** గొల్లపెల్లి మండలం లోని మల్లన్నపేట శ్రీ మల్లిఖార్జున స్వామి దేవాలయము (దొంగ మల్లన్న) షష్టి ఏడు వారాలు జాతర ఉత్సవాల సందర్భంగా శనివారం హుండీ లెక్కింపు ద్వారా ఆదాయం 23,08,733 మిశ్రమ బంగారం 7 గ్రామ్ 500 మిల్లీ గ్రామ్ మిశ్రమ వెండి 550 గ్రాముల వివిధ సేవా టికెట్ల ద్వారా 7,08,720-00 హుండీ లెక్కింపు కార్యక్రమం లో జగిత్యాల డివిజన్ ధర్మాదాయ ఆర్ ఐ, పరిశీలకులు రాజమొగిలి, ఫౌండర్ ట్రస్టీ కొండూరి శాంతయ్య, ఇఓ ముద్దం విక్రమ్ గౌడ్,పూజారి రాజేందర్, ఎస్ఐ ,కృష్ణ సాగర్ రెడ్డి పోలీస్ సిబ్బంది,ధర్మ దేవాదాయ శాఖ సిబ్బంది శివ కేశవ్, రవీందర్, శ్రీ లలితా సేవా ట్రస్ట్ సభ్యులు, తెలంగాణ గ్రామీణ బ్యాంకు, లక్ష్మీపూర్ బ్రాంచ్ సిబ్బంది పాల్గొన్నారు.

## గణిత ప్రతిభ పరీక్షలో మల్లన్నపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు విద్యార్థులు



**గొల్లపల్లి డిసెంబర్ 20 ప్రజా మంటలు (ప్రతినిధి అంకం భూమయ్య :** గొల్లపల్లి మండల స్థాయి గణిత ప్రతిభ పరీక్షలో మల్లన్న పేట ఉన్నత పాఠశాలకు చెందిన మాలెపు సంజన మండల టాపర్ గా నిలిచారు విద్యార్థి జగిత్యాలలో జరిగే ప్రతిభా పోటీ పరీక్షకు ఎంపిక అయ్యారు మల్లన్న పేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి, మహేష్ ,పాల్గొని గణిత ఉపాధ్యాయులు యం, రవీందర్, జె ,బాలచంద్రుడు విద్యార్థి,యం, సంజన ను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కరుణాకర్, రాజేశం, హరికృష్ణ, సత్య, చంద్రశేఖర్,ప్రకాష్, శరత్ చంద్ర, శ్రీనివాస్, సరస్వతి, విజయ, హరిత, నందయ్య పాల్గొన్నారు.

## దొంగ మల్లన్న స్వామి నా కోరిక మీరే నెరవేర్చాలని హుండీలో నమూనా బ్యాలెట్ పేపర్ వేసిన అభ్యర్థులు

**గొల్లపల్లి డిసెంబర్ 20 ప్రజా మంటలు (ప్రతినిధి అంకం భూమయ్య) :** గొల్లపల్లి మండలం లోనీ మల్లికార్జున స్వామి (దొంగ మల్లన్న) హుండీ లెక్కింపులో విచిత్రం చోటు చేసుకుంది. స్థానిక సంస్థల సర్పంచ్ ఎన్నికల్లో కొందరు అభ్యర్థులు కానుకలతో పాటు బ్యాలెట్ పేపర్లను హుండీలో వేసి సమర్పించినట్లు వెల్లడయింది. ఏదైనా ఎన్నికల్లో పోటీ చేసే వ్యక్తులు ఘన విజయం సాధించాలని సహజం కానీ కేటాయించిన గుర్తులతో ఉన్న నమూనా బ్యాలెట్ పేపర్లను హుండీలో నా ముడుపు తీర్చుకోవడానికి మీ ఆశీర్వాదంతో ఉండాలని కోరుకున్న అభ్యర్థి మల్లన్న షష్టి ఏడు వారాల జాతర బుధవారంతో ముగియగా శనివారం ఆలయ అధికారులు హుండీ లెక్కింపును ప్రారంభించే క్రమంలో నమూనా బ్యాలెట్ పేపర్లు హుండీ లెక్కింపు లభ్యమయింది అయితే హుండీలో వేసిన నమూనా బ్యాలెట్ లో ఉన్న అభ్యర్థులు ఎన్నికల్లో విజయం సాధించడంతో మల్లన్న అనుగ్రహంతోనే గెలిచారని చర్చనీయాంశంగా మారింది.

## ఈనెల 23 న ఆర్బీఐ "మీ డబ్బు - మీ హక్కు" ప్రత్యేక శిబిరం

**జగిత్యాల డిసెంబర్ 20 (ప్రజా మంటలు) :** రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా, కేంద్ర ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖ మరియు ఆర్థిక సేవల విభాగం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా వివిధ బ్యాంకుల్లో మరియు ఎల్ఐసి తదితర భీమా సంస్థల్లో క్లైమ్ చేయకుండా ఉన్న డిపాజిట్లు, భీమా మొత్తాలు మన జిల్లాకు సంబంధించి 36 కోట్ల రూపాయలు ఉన్నట్లుగా ఆర్బీఐ నివేదిక తెలిపిందని, వాటిని తిరిగి పొందేందుకై ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో "మీ డబ్బు - మీ హక్కు" అన్న నినాదంతో ఈనెల 23 వ తేదీన జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా 23 వ తేదీన ఉదయం 11 గంటలకు జిల్లా పరిధిలోని వివిధ బ్యాంకులు, ఎల్ఐసి తదితర భీమా సంస్థల స్టాల్స్ ఏర్పాటు చేసి క్లైమ్ చేయని డిపాజిట్లు, భీమా మొత్తాలపై పూర్తి సమాచారం అందిస్తామని తమకు లేదా కుటుంబ సభ్యులకు సంబంధించిన క్లైమ్ చేయని ఖాతాలు ఉన్నాయా అనే విషయాన్ని తెలుసుకునే అవకాశం ఉందని క్లైమ్ విధానం, అవసరమైన పత్రాలు, దరఖాస్తు ప్రక్రియపై అవగాహన కల్పించడం జరుగుతుందని ఆయన తెలిపారు. పదేళ్లకు పైబడి బ్యాంకుల్లో క్లైమ్ చేసుకోకుండా ఉన్న నిల్వ వివరాలు ఆర్బీఐ ఉద్గం వెబ్సైట్ లో పొందవచ్చని ఆయన అన్నారు.కావున జిల్లా లోని ప్రజలు తమ గుర్తింపు పత్రాలు, ఖాతా వివరాలతో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# ఒక రోజు, ఒక అంశం, ఒకే పద్ధతిలో బోధన

**అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆర్ఎల్ఎం విధానం**

**అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆట ఆధారిత విద్య**

**ఒకే తీరుగా బోధన ఉండేలా ఆర్ఎల్ఎం విధానం**

**అమలు తీరుపై కేంద్రం ప్రశంస**

**పిల్లలతో అక్షరాలను గుర్తించే యాక్టివిటీ చేయిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త**



చిన్నచిన్న గదుల్లో ఒత్తిడితో కూడిన విద్య కాకుండా అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారులకు ఆట, పాటలతో చదువు నేర్పుతున్నాయి. ఆహ్లాదకర వాతావరణంలో ఏరోజుకారోజు వారు ఉత్సాహకంగా, ఉల్లాసంగా నేర్చుకునేలా ఆటవస్తువులతో బోధన సాగిస్తున్నారు. ఇంద్రియ జ్ఞానం, పరిసరాల పరిశుభ్రత తదితర సామర్థ్యాలన్నీ ఆటల ద్వారానే నేర్పిస్తున్నారు. ఈ ఆటల ఆధారిత విద్య ఒక్కో అంగన్‌వాడీ కేంద్రంలో ఒక్కో విధంగా లేకుండా అంతటా ఏకరూపత ఉండేలా 'రిమోట్ లెర్నింగ్ మెసేజ్' (ఆర్ఎల్ఎం) విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. దీని ద్వారా అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒక రోజు ఒక అంశంపైనే ఒకే విధంగా బోధన ఉంటుంది. ఇలా చేయడంతో చిన్నారులంతా ఒకే విధమైన అభ్యాసన సామర్థ్యాలు సాధిస్తారు.రాష్ట్రవ్యాప్తంగా 55,746 అంగన్‌వాడీ కేంద్రాల్లో 3-6 ఏళ్ల లోపు చిన్నారులు 8 లక్షల మంది ఉన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు వీరికి బోధిస్తున్నారు. దేశవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో బోధనకుగాను కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానం ప్రకారం 'ఆధార్ శిల' పేరుతో ప్రత్యేక సిలబస్‌ను రూపొందించింది. ఆంగ్లభాషలో ఉన్న దీన్ని రాష్ట్రంలో చిన్నారులకు బోధించడానికి వీలుగా తెలుగులోకి అనువదించారు. ఏ రోజు, ఏ వారం, ఏ నెల ఏం చెప్పాలనేది అంగన్‌వాడీ కార్యకర్తలకు స్పష్టంగా నిర్దేశిస్తూ ప్రత్యేక క్యాలెండర్ రూపొందించారు.ప్రభుత్వం రూపొందించిన క్యాలెండర్‌కు అనుగుణంగా ఆర్ఎల్ఎం విధానాన్ని అమలు చేస్తున్నారు. పిల్లల్లో తీసుకురావాల్సిన సామర్థ్యం, నైపుణ్యాన్ని బట్టి ఈ పద్ధతిలో నిర్దేశిత పాఠ్యాంశాన్ని ఎలా బోధించాలన్న విషయాన్ని స్పష్టంగా తెలియజేస్తూ రోజువారీ వీడియోలు రూపొందించారు. పిల్లలకు మరుసటి రోజు బోధించాల్సిన అంశానికి సంబంధించిన వీడియోను ఆ ముందు రోజే రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు పంపుతారు. కార్యకర్తలు దాన్ని చూసి బోధనకు అవసరమైన వస్తువుల్ని(టీచింగ్ ఎయిడ్స్) ముందుగానే సమీకరించి పిల్లలతో కేంద్రాల్లో ఆ యాక్టివిటీని చేయిస్తారు. ఇదే వీడియోను తల్లిదండ్రులకు పంపి వారిని కూడా ఇందులో భాగస్వాములను చేస్తారు. ఆర్ఎల్ఎం విధానం కారణంగా పిల్లల్లో ఐక్యూ స్థాయి పెరుగుతుంది. రాష్ట్రంలో ఈ విధానం అమలవుతున్న తీరును కేంద్ర ప్రభుత్వం కూడా ప్రశంసించింది.కేంద్రాల్లోని 3-6 ఏళ్ల చిన్నారుల్లో 6 రకాల అంశాలను అభివృద్ధి చేయనున్నారు. అవి శారీరకాభివృద్ధి, నైతిక, మేధ, భాష, సాంస్కృతికాభివృద్ధి, సానుకూల అభ్యసన అలవాట్లు. 13 రకాల నైపుణ్యాలను పిల్లల్లో పెంపొందించాలనేది ప్రధాన లక్ష్యం. 100కిపైగా సామర్థ్యాలు వారిలో అభివృద్ధి కానున్నాయి. పిల్లలకు ఆసక్తికరంగా బోధించేందుకు 130 కార్యక్రమాలను సిద్ధం చేశారు.

**యాప్‌లతో అంగన్‌వాడీల్లో అక్రమాలకు చెక్**

**చుక్కలు చూపిస్తోన్న యాప్ - అంగన్‌వాడీల్లో తప్పని తిప్పలు**

కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా ఫోకస్: బాల్యం బక్కచిక్కుతోంది. పోషకాహార లేమితో చిన్నారులు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఈ క్రమంలో పిల్లల ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది. అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో పంపిణీ చేసే ఆహారం ఆరోగ్యకరంగా, బలవర్ధకంగా ఉండేలా చర్యలు చేపట్టింది. చిన్నారులకు మరింత రుచికరమైన, ఎక్కువ పోషకాలుండే ఆహారం అందించేలా కసరత్తు ప్రారంభించిన సంగతి తెలిసింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 3558 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఆయా కేంద్రాల్లో ఆరు నెలల నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులు 2,71,588 మంది వరకు ఉన్నారు. వీరిలో 3 నుంచి 6 సంవత్సరాల పిల్లలకు అల్పాహారంగా ఉడికించిన కోడిగుడ్డు, 100 ఎంఎల్ పాలు, మధ్యాహ్నం పప్పుతో కూడిన భోజనం అందిస్తున్నారు. మూడేళ్లలోపు చిన్నారులకు బాలామృతం ప్యాకెట్లను ఇస్తున్నారు.



# విజయవాడలో బాల వైజ్ఞానిక ప్రదర్శన

**ప్రత్యేక ఆకర్షణగా విద్యార్థుల ప్రాజెక్టులు**

**విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానం పెంపు కోసం ప్రభుత్వం శ్రీకారం**

**పర్యావరణహితంగా విద్యార్థి, ఉపాధ్యాయుల ప్రాజెక్ట్‌లు**

**మరిన్ని కార్యక్రమాలతో విద్యార్థులకు ప్రోత్సాహం**



విద్యార్థి దశ నుంచి ఆలోచనలకు పదునుపెడితే సరికొత్త ఆవిష్కరణలు సాధ్యమౌతాయని నిరూపించారు ఆ విద్యార్థులు. గురువులిచ్చిన ప్రోత్సాహంతో అనేక ప్రాజెక్టులను తయారు చేశారు. వీటికి విజయవాడలో నిర్వహించిన ఎన్టీఆర్ జిల్లా స్థాయి రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శన వేదిక అయింది. విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు తయారు చేసిన ప్రాజెక్టులు ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.విజయవాడలో ఎన్టీఆర్ జిల్లా స్థాయి రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శనను కలెక్టర్ లక్ష్మీశ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు తయారు చేసిన ప్రాజెక్టులో ఆకట్టుకున్నాయి. ప్రజల జీవనాన్ని సులభతరం చేయడంతో పాటు మానవులకు ఉపయోగపడే అనేక ఆవిష్కరణలు ఇక్కడ ప్రదర్శించారు. రసాయన ఎరువులు వినియోగించకుండా వ్యవసాయం చేసుకునేందుకు సరికొత్త పద్ధతిని కొంత మంది విద్యార్థులు కనిపెట్టారు. పరిశ్రమలు వెదజల్లే వాయు కాలుష్యాన్ని శుద్ధి చేసే విధంగా ప్రాజెక్టును అభివృద్ధి చేశాడు ఓ విద్యార్థి. ఇలా ప్రస్తుతం సమాజాన్ని పట్టిపీడిస్తున్న అనేక సమస్యలపై విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రాజెక్టులు చేశారు. ప్రాజెక్టులను ప్రదర్శించి వారిలోని నైపుణ్యాలను ఇతరులతో పంచుకున్నారు.

**ఎన్టీఆర్ జిల్లాలో రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శన వేదిక**

భవిష్యత్తు తరాలకు ఉపయోగం: తాము ప్రదర్శించిన ఈ ప్రాజెక్టులు భవిష్యత్ తరాలకు ఎంతో ఉపయోగపడతాయని విద్యార్థులు, ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు.'ఈ ప్రాజెక్ట్‌ను మేము పాలీతిన్ కవార్లను వాడి ఫ్లోటింగ్ బ్రిక్స్‌తో ఓ ఇంటిని నిర్మించాం. దీని ద్వారా వరదలు వచ్చినప్పుడు సురక్షితంగా ఉండొచ్చు. అలాగే పర్యావరణ పరిరక్షణగా ఉంటుంది. దీనిని భవిష్యత్తులో ఇంకా అభివృద్ధి చేస్తే వరదల భారీన పడకుండా ఉండొచ్చు. అలాగే పాలీతిన్ కవార్ల నుంచి వచ్చే కాలుష్యం తగ్గి, మన భూమి పర్యావరణ హితంగా మారుతుంది'.'ముఖ్యంగా ఇప్పుడు ప్లాస్టిక్ పొల్యూషన్ ఎక్కువగా ఉంది. దీంట్లో ఎక్కువగా రేపర్లు ఎక్కడపడితే అక్కడే కనిపిస్తున్నాయి. అందుకే వీటిని వాడి విద్యకు సంబంధిన పరికరాలు కొన్ని, అలంకరణ వస్తువులు, ఆప్రాన్ వంటివి తయారు చేశాం. దీని ద్వారా కొంత మేరకు కాలుష్యాన్ని తగ్గించవచ్చనే అభిప్రాయంతో మేము ఈ ప్రాజెక్ట్‌తో మీ ముందుకొచ్చాం.'రాష్ట్ర ప్రభుత్వం బాల వైజ్ఞానిక ప్రదర్శనల పేరుతో సరికొత్తగా ఈ కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తోంది. ప్రస్తుతం మండల స్థాయిలో ఇటువంటి కార్యక్రమాలు పూర్తయ్యి జిల్లా స్థాయిలో జరుగుతున్నాయి. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత రాష్ట్ర స్థాయిలో ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో ఉత్తమంగా రాణించిన విద్యార్థులు, ఉపాధ్యాయుల ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపిక చేస్తారు. విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంచేందుకు ఇటువంటి కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించవచ్చని కలెక్టర్ లక్ష్మీశ అభిప్రాయపడ్డారు. చిన్ననాటి నుంచే విద్యార్థులు సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

# రాంగ్ రూట్‌లో వెళ్తున్నారా - అయితే మీ బండి సీజ్ చేస్తారు జాగ్రత్త!

**రోడ్డు ప్రమాదాల నివారణకు తెలంగాణ పోలీసుశాఖ కార్యాచరణ**

**ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలకు నిర్ణయం**

**హైవేలపై రాంగ్‌రూట్‌లో వస్తే వాహనాలు స్వాధీనం**



ప్రస్తుతం బయట కాలుపెడితే క్షేమంగా ఇంటికి చేరుకోవడం అనుమానంగా మారింది. వాహనదారులు అడ్డగోలుగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ అమాయకులైన ఎదుటి వారి ప్రాణాలు తీస్తున్నారు. తమ ప్రాణాలు కూడా తీసుకుంటున్నారు. దీనిపై ప్రత్యేక దృష్టిపెట్టిన తెలంగాణ పోలీసుశాఖ ట్రాఫిక్ నిబంధనలు పటిష్ఠంగా అమలు చేయగలిగితే చాలా వరకు ప్రమాదాలు నివారించవచ్చని భావిస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటి వరకు ఎరైవ్..ఎలైవ్ పేరుతో రాష్ట్రవ్యాప్తంగా ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టగా, రాబోయే రోజుల్లో దీన్ని మరింత ఉద్ధృతం చేయనుంది. తర్వాత నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడేవారి విషయంలో మరింత కఠినంగా వ్యవహరించనుంది.

రాష్ట్రంలో నిత్యం సగటున జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు 74

మరణిస్తున్న వారు 20 మంది

నమోదవుతున్న ట్రాఫిక్ ఉల్లంఘనల సంఖ్య 72 వేలు

ఈ అంకెలు చూస్తే చాలు రాష్ట్రంలో రహదారులపై పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

హైవేలపై ఎదురుగా వస్తే వాహనాలు స్వాధీనం : ఏ రోడ్డు మీద చూసినా అడ్డగోలుగా వాహనాలను నడిపేవారు అనేక మంది మనకు కనిపిస్తుంటారు. సిగ్నల్ పడినా పట్టించుకోకపోవడం, అడ్డూ అదుపూలేని వేగం వంటివి వారికి మామూలు విషయాలుగా మారాయి. చిన్నపాటి నిర్లక్ష్యమే ప్రాణం తీస్తుందని ఎవరు కూడా అంతగా పట్టించుకోవడంలేదు. గత ఏడాది సగటున రోజుకు రాష్ట్రంలో ట్రాఫిక్ ఉల్లంఘనలు 52 వేలు నమోదైతే ఈ ఏడాది 70 వేలకు పెరగడం ఆందోళన కలిగిస్తోంది.పటిష్ఠ పర్యవేక్షణతోనే ఉల్లంఘనలు తద్వారా ప్రమాదాలు తగ్గించవచ్చని నిర్ణయించిన ఉన్నతాధికారులు అతివేగంగా వాహనాలు నడుపుతున్న వారిపట్ల కఠినంగా వ్యవహరించనున్నారు. హైవేలపై రాంగ్‌రూట్లో ఎదురుగా వచ్చే వాహనాలను స్వాధీనం చేసుకునే అవకాశాలను సైతం పరిశీలిస్తున్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకోనున్నారు. మరోవైపు ప్రమాద బాధిత కుటుంబాలతో మాట్లాడించడం ద్వారా వారు అనుభవిస్తున్న క్షోభ మరెవరికీ రాకూడదన్న సందేశాన్ని వాహనదారులకు ఇవ్వాలనుకుంటున్నారు.ప్రస్తుత రోజుల్లో రోడ్డుపై నడవాలంటే చాలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి. రోడ్డుపై బైక్ మీద అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటూ వెళ్లి రాంగ్ రూట్‌లో వచ్చిన వారు ఢీకొట్టి తీవ్రగాయాలు, ప్రాణాలు కోల్పోతుండడం వంటి వార్తలు ఎన్నో కనిపిస్తున్నాయి. నిత్యం రోడ్డు ప్రమాదంలో ఎవరో ఒకరు మరణించారనే వార్త మన చెవుల్లో నానుతునే ఉంటుంది. కొన్నిసార్లు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్లాలన్నా ప్రాణాలకు ఎలాంటి గ్యారంటీ ఉంటడం లేదు. ఇవన్నీ పోవాలంటే ట్రాఫిక్ నిబంధనలే మనకు శ్రీరామరక్ష. ఈ నిబంధనలను మనం పాటించడంతో పాటు మన ఇంట్లో వాళ్లకూ కచ్చితంగా పాటించాలని, లేకుంటే ఖర్చయిపోతామని అర్థమయ్యేటట్లు గట్టిగా వివరించాలి.

**రోడ్డు ప్రమాదాలకు ముఖ్యమైన కారణాలు :**

హెల్మెట్ ధరించకపోవడం

అతి వేగం

సిగ్నల్ జంప్

నిర్లక్ష్యపు డ్రైవింగ్

ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం

రాంగ్‌రూట్‌లో ప్రయాణాలు

ఓవర్ టేక్

డ్రంకెన్ డ్రైవ్

**ట్రాఫిక్ నిబంధనలు పాటించేందుకు ఇలా చేద్దాం :**

బైక్ బయటకు తీసుకెళ్తే కచ్చితంగా హెల్మెట్ ధరించాలి.

బీబ్రా లైన్స్ వద్దనే పాదచారులు రోడ్లు దాటాలి.

కారు నడిపేటప్పుడు కచ్చితంగా సీటు బెల్టు పెట్టుకోవాలి.

సిగ్నల్ పడినప్పుడు కచ్చితంగా ఆగి తీరాలి.

అత్యవసరంగా ఎవరైనా రోడ్డు దాటుతుంటే వాహనం ఆపాల్సిందే.

ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా పెద్ద ఎత్తున చలాన్లు రావడం ఆందోళన కలిగిస్తోంది. వాహనదారులు ఇప్పటికైనా ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన తెచ్చుకోవాలని పలువురు నిపుణులు సూచిస్తున్నారు. మన పొరుగు దేశం శ్రీలంకలోని ప్రతి పట్టణంలో ట్రాఫిక్‌పై ప్రజలకు ఎంతో అవగాహన ఉంది. నిబంధనలను తప్పకుండా పాటిస్తూ, జీబ్రా లైన్ల వద్దే రోడ్లు దాటుతారు. అత్యవసర సమయంలో వేరే చోట రోడ్లు దాటాల్సి వస్తే వాహనాలను అక్కడికక్కడే ఆపేస్తారు.

# లైవ్ డిబేట్‌లో ప్యానెలిస్ట్‌తో కుస్తీకి దిగిన బాబా రామ్‌దేవ్.. చివరికి..!

**ఓ టీవీ ఛానల్ లైవ్ డిబేట్‌లో రామ్‌దేవ్, ప్యానెలిస్ట్ మధ్య మల్ల యుద్ధం**

**సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియో**

**సరదాకే చేశానన్న రామ్‌దేవ్.. ట్రోల్ చేస్తున్న నెటిజన్లు**

యోగా గురువు బాబా రామ్‌దేవ్ ఒక జాతీయ టీవీ ఛానల్ లైవ్ డిబేట్‌లో ఒక ప్యానెలిస్ట్‌తో కుస్తీకి దిగారు. ప్రస్తుతం ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, నెటిజన్లు ఆయనపై ట్రోల్స్ చేస్తున్నారు.వివరాల్లోకి వెళితే.. అమర్ ఉజాలా టీవీ ఛానల్ నిర్వహించిన ఒక చర్చా కార్యక్రమంలో ఈ ఘటన చోటుచేసుకుంది. చర్చ మధ్యలో తన బలాన్ని ప్రదర్శించేందుకు రామ్‌దేవ్ బాబా.. తన ఎదురుగా ఉన్న ప్యానెలిస్ట్‌పై ఓ కుస్తీ ఎత్తుగడ ప్రయోగించబోయారు. అయితే, ఆ ప్యానెలిస్ట్ అంతే వేగంగా స్పందించి, రామ్‌దేవ్‌ను నిలువరించేందుకు యత్నించారు. దాంతో ప్యానెలిస్ట్ ను కిందపడేయడంలో రామ్‌దేవ్ బాబా విఫలమయ్యారు.అయితే, జరిగిన దానిపై రామ్‌దేవ్ బాబా స్పందిస్తూ అదంతా కేవలం సరదా కోసం చేసిందేనని, సీరియస్‌గా తీసుకోవద్దని వివరణ ఇచ్చారు. కానీ, ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు తమదైనశైలిలో స్పందిస్తున్నారు. రామ్‌దేవ్ వేసిన ఎత్తుగడ ఆయనకే రివర్స్ అయిందంటూ సెటైర్లు వేస్తున్నారు. "పతంజలి నెయ్యి తింటే ఇలాగే జరుగుతుంది" అని కొందరు, "స్కామ్‌దేవ్" అంటూ మరికొందరు కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు.మరోవైపు టీవీ ఛానళ్లు రేటింగ్స్ కోసం చర్చా కార్యక్రమాలను కుస్తీ పోటీలుగా మారుస్తున్నాయంటూ మీడియా విశ్లేషకులు విమర్శిస్తున్నారు.

# మీ ఫోన్ నంబర్ ఇక భద్రం

**అనుమతి లేకుండా వాడినా, చోరీకి గురైనా రూ.250 కోట్ల జరిమానా**

**మీ ఫోన్ నంబర్‌ను రక్షించడానికి డీపీడీపీ చట్టం**

**2027 మే 14 నుంచి అమలు - మొత్తం 23 సెక్షన్లతో నిబంధనలు**

**ఫోన్ నంబరు తీసుకున్న సంస్థే బాధ్యత వహించాలన్న చట్టం**



డిజిటల్ ప్రపంచంలో వ్యక్తిగత సమాచారానికి రక్షణ కల్పించేందుకు కేంద్రం 2023లో డీపీడీపీ చట్టం తీసుకువచ్చింది. ఇప్పుడు ఈ చట్టానికి సంబంధించిన నిబంధనలు అమలులోకి వచ్చాయి. నవంబరు 14 నుంచి కొన్ని అమలులోకి రాగా, ఏడాది తర్వాత ఇంకొన్ని, 18 నెలల తర్వాత మరికొన్ని నిబంధనలు అమలులోకి రాబోతున్నాయి. ఈ లెక్కన 2027 మే 14 నుంచి డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్(డీపీడీపీ) చట్టం పూర్తిస్థాయిలో అమలులోకి వచ్చేస్తుంది.దుకాణానికి వెళ్లినప్పుడో, ఈ-కామర్స్ ద్వారా సరకులు కొన్నప్పుడో, క్యాబ్ బుక్ చేసుకున్నప్పుడో ఇలా వివిధ సందర్భాల్లో ఇచ్చే ఫోన్ నంబర్, ఈ-మెయిల్ ఐడీ వంటి డిజిటల్ సమాచారం దుర్వినియోగం అవుతున్న సంగతి మనకు తెలిసిందే. అందుకే డిజిటల్ సమాచారానికి రక్షణ కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం డీపీడీపీ చట్టం తీసుకువచ్చింది. వాస్తవానికి ఈ ఏడాది జనవరి నెలలోనే ఇందుకు సంబంధించిన నిబంధనలు రూపొందించినప్పటికీ, వాటిపై ప్రజల అభిప్రాయాలు స్వీకరించిన తర్వాత అవసరమైన మార్పులు చేర్పులు చేశారు. ఆ తర్వాత నవంబరు 13న కేంద్రం గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.ఈ నిబంధనల్లో మొత్తం 23 సెక్షన్లు ఉండనున్నాయి. వీటిలో సెక్షన్ 1, 2, 17, 18, 19, 20, 21 తక్షణమే అమలులోకి వచ్చాయి. సెక్షన్ 4 మాత్రం గెజిట్ నోటిఫికేషన్ వెలువడిన ఏడాదికి అంటే 2026 నవంబరు 13వ తేదీ నుంచి అమలులోకి రానుంది. ఇక సెక్షన్ 3తో పాటు 5 నుంచి 16, 22, 23 సెక్షన్లు మాత్రం 18 నెలల తర్వాత నుంచి అమలులోకి రానున్నాయి. అనుమతి లేకుండా సమాచారాన్ని తీసుకున్నా, తీసుకున్న సమాచారాన్ని ఇతరత్రా వాడుకున్నా, చివరకు చోరీ అయినా సంబంధిత సంస్థే బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఆరోపణలు నిరూపణ అయితే రూ.250 కోట్ల వరకూ ఆ సంస్థకు జరిమానా విధించవచ్చు.

**తక్షణం అమలులోకి వచ్చేవి :**

డేటా ప్రొటెక్షన్ బోర్డ్ ఆఫ్ ఇండియాకి ఛైర్‌పర్సన్, సభ్యుల ఎంపికకు క్యాబినెట్ కార్యదర్శి, న్యాయ వ్యవహారాలు, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖల ప్రతినిధులతో సెర్చ్ కమిటీ ఏర్పాటు చేయనున్నారు.సెర్చ్ కమిటీ సూచించిన వారిని నియమించడం.ఛైర్‌పర్సన్, బోర్డు సభ్యుల వేతనాలు, బోర్డు సమావేశాలకు సంబంధించి తేదీలు నిర్ధారించడం, ఈ సమావేశాలకు సంబంధించిన విధి విధానాలు, తీర్మానాలను ప్రతిపాదించడం.విచారణకు ఎవరూ భౌతికంగా హాజరు కావాల్సిన అవసరం లేదు. ఆన్‌లైన్ ద్వారానే వాదనలు అనేవి వినిపించవచ్చు.ఈ బోర్డు జారీ చేసే ఆదేశాలను విభేదించేవారు అప్పిలేట్ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించవచ్చును.ఫిర్యాదు లేదా సమాచారం వచ్చినప్పుడు ఆరు నెలల్లో విచారణ పూర్తి చేయడం. ఒకవేళ ఏదైనా కారణాల వల్ల వీలుపడకపోతే గడువు మరో మూడు నెలలు పెంచుకునే వెసులుబాటు కల్పించారు.ఏడాది తర్వాత అమలులోకి వచ్చేవి : వ్యక్తిగత సమాచారం సేకరించేందుకు సంస్థలు కంటెంట్ మేనేజర్లను నియమించుకోవాల్సిన అవసరం ఉంది. సంబంధిత సంస్థ సమర్పించే వివరాల ఆధారంగా డేటా ప్రొటెక్షన్ బోర్డ్ ఆఫ్ ఇండియా ఆ నియామకంపై నిర్ణయం తీసుకోనుంది. సంతృప్తి చెందితే నియామకాన్ని ఆమోదించే, లేదంటే తిరస్కరించే అధికారం బోర్డుకు ఉంటుందనే నిబంధన ఏడాది తర్వాత అమలులోకి రానుంది.వ్యక్తిగత సమాచారం నమోదుకు అవలంబించాల్సిన పద్ధతులు, దానికి రక్షణ, ఒకవేళ సమాచారం దొంగలించబడితే తీసుకోవాల్సిన చర్యలు, తమ సమాచారం దుర్వినియోగం అయినట్లు బాధితుడు అనుమానిస్తే ఫిర్యాదు చేసే విధానం, దానికి సంబంధించి జరిగే విచారణ, తీర్పు వంటివి 2027 మే 13 తర్వాత నుంచి అమలులోకి రానున్నాయి.

# ఈ నెల 26 నుంచి పరిహారం ఇండిగో కీలక ప్రకటన

**విమానాల రద్దుతో ఇబ్బందిపడ్డ ప్రయాణికులకు ఇండిగో పరిహారం**

**అదనంగా రూ.10,000 ట్రావెల్ వోచర్**

**ఈ నెల 26 నుంచి పరిహారం చెల్లింపులు ప్రారంభం**

**పరిహారం ప్రక్రియను పర్యవేక్షించనున్న కేంద్ర విమానయాన శాఖ**




ఇటీవల విమానాలను భారీగా రద్దు చేసి ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన ఇండిగో ఎయిర్‌లైన్స్, వారికి పరిహారం చెల్లించేందుకు ముందుకొచ్చింది. ఈ నెల 3, 4, 5 తేదీల్లో విమానాశ్రయాల్లో గంటల తరబడి చిక్కుకుపోయిన ప్రయాణికులకు ఈ నెల 26 నుంచి రూ.10,000 విలువైన ట్రావెల్ వోచర్లను జారీ చేయనుంది.ప్రభుత్వ నిబంధనల ప్రకారం చెల్లించాల్సిన రూ.5,000 నుంచి రూ.10,000 పరిహారానికి ఇది అదనం. విమానయాన శాఖ కార్యదర్శి సమీర్ సిన్హా అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి సమీక్షలో ఈ నిర్ణయం తీసుకున్నారు. అర్హులైన ప్రయాణికులందరికీ తక్షణమే చెల్లింపులు జరిగేలా చూడాలని ఇండిగోను ప్రభుత్వం ఆదేశించింది.నేరుగా ఇండిగో వెబ్‌సైట్‌లో టికెట్లు బుక్ చేసుకున్న వారికి వారం రోజుల్లోగా చెల్లింపులు ప్రారంభించాలని సమావేశంలో నిర్ణయించారు. ట్రావెల్ ఏజెంట్లు, ఆన్‌లైన్ పోర్టళ్ల నుంచి ప్రయాణికుల వివరాలు సేకరించి, వారికి కూడా నేరుగా పరిహారం అందించాలని ఇండిగోకు సూచించారు. ఈ ప్రక్రియను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ), ఎయిర్ సేవా పోర్టల్ ద్వారా విమానయాన శాఖ పర్యవేక్షించనుంది.రద్దయిన విమానాలకు సంబంధించి ఇండిగో రిఫండ్లు ప్రారంభించినప్పటికీ, ఆన్‌లైన్ ట్రావెల్ ఏజెన్సీల ద్వారా బుక్ చేసుకున్న చాలా మందికి ఇంకా డబ్బులు అందలేదని తెలుస్తోంది. డీజీసీఏ ఆదేశాలతో మేక్ మై ట్రిప్ సంస్థ ఇండిగో నుంచి డబ్బులు రాకముందే దాదాపు రూ.10 కోట్లు రిఫండ్ చేసినట్లు సమాచారం. మరోవైపు భవిష్యత్తులో ఇలాంటి భారీ వైఫల్యాలు పునరావృతం కాకుండా సమస్య మూలాలను గుర్తించడానికి బయటి సాంకేతిక నిపుణులతో కలిసి పనిచేస్తామని ఇండిగో ఛైర్మన్ విక్రమ్ సింగ్ మెహతా తెలిపారు.ఈ నెల 8 నుంచి తమ నెట్‌వర్క్‌లోని అన్ని గమ్యస్థానాలకు విమాన సేవలు పూర్తిగా పునరుద్ధరించామని, 9 నుంచి కార్యకలాపాలు సాధారణ స్థితికి వచ్చాయని కంపెనీ పేర్కొంది.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com